ఆక్రమణల భయం..

ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆక్రమణదారులు అటువంటి స్థలాలను తన్నుకుపోయే ప్రమాదం ఉంది. తాజాగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల పాత ఎంఆర్‌వో కార్యాలయ స్థలం విషయంలో కూడా ఇలాగే జరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఆ స్థలాన్ని కబళించాలని కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసి.. స్థానికులకు ఉపయోగపడేలా ఆ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ కానీ, కమ్యూనిటీ భవన నిర్మాణం గానీ చేయాలని కోరుతున్నారు.

- కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని పాత ఎంఆర్‌వో కార్యాలయ స్థలంపై కబ్జాదారుల కన్ను
- అటువంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని స్థానికుల డిమాండ్
- సామాజిక అవసరాలకు వినియోగించాలని అభ్యర్థన


కెప్టెన్ రామారావు జంక్షన్


ఆక్రమణకు గురవుతున్న కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని పాత ఎంఆర్‌వో కార్యాలయ స్థలం

అల్లిపురం : పాత నగరంలో ప్రభుత్వ స్థలాలు చాలా తక్కువ. ఉన్న ఒకటీ అరా స్థలాలపై ఆక్రమణదారుల కళ్లు పడుతున్నాయి. వాటిని ఎలాగైనా ఆక్రమించాలని కొంత మంది ప్రయత్నిస్తున్నారు. జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల పాత ఎంఆర్‌వో కార్యాలయం ప్రస్తుతం శిథిలమైంది. అక్కడ ఇప్పుడు ఎటువంటి భవనం లేదు. దీనిని ఆసరాగా తీసుకుని ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం రాత్రి సమయంలో పొక్లెయిన్‌తో ఆ స్థలంలో గల డెబ్రిస్‌ను తొలగించేందుకు ప్రయత్నించటం ఇందుకు నిదర్శనమని అంటున్నారు. దీనిపై వార్డు కార్పొరేటర్ తోట పద్మావతికి సమాచారం ఇవ్వడంతో దానిని నిలుపుదల చేశారు.

ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించండి..

ప్రభుత్వానికి చెందిన పాత ఎంఆర్‌వో కార్యాలయ స్థలం స్థానికులకు ఉపయోగపడేలా సులభ్ కాంప్లెక్స్ లేదా స్థానికుల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాలు నిర్మించాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకునేందుకు జీవీఎంసీ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని రక్షించండి..



ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకోవాలి. పాత ఎంఆర్‌వో కార్యాలయ స్థలం ప్రజల ఆస్తి. ఒకప్పటి హెరిటేజ్ స్థలం అది. జీవీఎంసీ వారు ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణం చేపట్టాలి.

– వాసుపల్లి నర్సింగ్, కెప్టెన్ రామారావు జంక్షన్,

సులభ్ కాంప్లెక్స్ నిర్మించండి..



ప్రభుత్వ స్థలాన్ని స్థానికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. అందరూ ఉపయోగించుకునేలా అక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తే బాగుంటుంది. జీవీఎంసీ అధికారులు ఆలోచించాలి.

– కోరువాడ లక్ష్మి, అచ్చియ్యమ్మపేట

అందరికీ ఉపయోగపడేలా ఉండాలి..



ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారు. అందరికీ ఉపయోగపడేలా ఖాళీ స్థలాన్ని వినియోగించాలి. ఆక్రమణదారుల నుంచి కాపాడుకునేందుకు ప్రయత్నించాలి.

– తమరాన మధు, కెప్టెన్ రామారావు జంక్షన్,

కమ్యూనిటీ హాలు నిర్మించండి..



స్థానికంగా గల మహిళలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాలు నిర్మించాలి. దీని వలన మహిళలు కుట్టు శిక్షణ, ఇతర అంశాల్లో తర్ఫీదు పొందేందుకు ఉపయోగపడుతుంది.

– కాట కళావతి, అచ్చియ్యమ్మపేట

తెరుచుకున్న ఆలయాలు


సంప్రోక్షణ అనంతరం విశేష అలంకరణలో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : చంద్రగ్రహణం సందర్భంగా శనివారం రాత్రి నుంచి దేవాలయాలు మూసివేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నియోజకవర్గంలో ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమాసహిత సత్యనారాయణ స్వామి, అంబికాబాగ్‌లో కనకమహాలక్ష్మీ దత్తత దేవాలయం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయం, టౌన్‌కొత్తరోడ్డులో గల జగన్నాథస్వామి దేవస్థానం, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం, ఆంజనేయస్వామి దేవస్థానం, పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం, బాబా ఆలయాలు, రామాలయం, అల్లిపురం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాంగార్డెన్స్‌లోని శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర దేవాలయాల్లో ఆదివారం ఉదయం సంప్రోక్షణ చేపట్టారు. మూలవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం, విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.

క్లుప్తంగా

చేతివృత్తులతో ఆర్థిక స్వావలంబన


మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న సాధిక్

జగదాంబ : చేతివృత్తుల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. ఫెర్రీరోడ్డులోని డాన్‌బాస్కో సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శిక్షణలో భాగంగా ఆదివారం నాల్గో విడత శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా మహిళలకు పలు అంశాల్లో శిక్షణ నిర్వహిస్తున్నాయన్నారు. ఇదే విధంగా మరింత మందికి కుట్టు శిక్షణ ఇచ్చి మహిళలకు ఆసరా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాన్‌బాస్కో సంస్థ నిర్వాహకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోపీకృష్ణకు పితృ వియోగం


వెంకట రమణమూర్తి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణకు పితృవియోగం కలిగింది. తెల్లవారు జామున అస్వస్థతకు గురి కావటంతో ఆయన మృతి చెందారని గోపి తెలిపారు. గోపి తండ్రి వెంకట రమణ మూర్తి (90) వ్యాపారవేత్తగా నగరవాసులకు సుపరిచితులు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో గల వివేకానందకాలనీలోని వారి నివాసంలో రమణమూర్తి పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకుని నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షణ


ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట : ఆదివారం ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ప్రధాని మోదీ 106వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ మెడికల్ సెల్ అధ్యక్షుడు రూపాకుల రవికుమార్ తదితరులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు


1988 బ్యాచ్ సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థులు

దాబాగార్డెన్స్ : వారంతా ఐదు దశాబ్దాల క్రితం నాటి మిత్రులు. వీరిలో ఒక్కొక్కరూ ఒక్కో స్థాయికి చేరుకున్నారు. చదువుకున్న విద్యా సంస్థ పరిధిలో స్థిరపడిన వారు కొందరైతే.. రాష్ట్రం, దేశ, విదేశాల్లో స్థిరపడినవారు మరి కొందరు. వీరంతా ఆదివారం నగరంలోని ఓ హోటల్లో కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. వారే సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1988వ బ్యాచ్ విద్యార్థులు. గత పదేళ్లుగా పూర్వ విద్యార్థులందరూ వాట్సప్ గ్రూప్ ద్వారా ఒక్కటయ్యారు. వీరంతా పదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.. విద్యనందించిన పాఠశాలను గుర్తుకు తెచ్చుకుంటూ హాయిగా గడిపారు. అందుకు స్వర్ణ వేదికగా నామకరణం చేసుకున్నారు. ఈ వేదిక ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తోటి మిత్రులకు చారిటీ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. సుమారు 90 మంది పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకున్నారు.

హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం



ద్వారకానగర్ ఆటోస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : కార్మిక వర్గం హక్కుల సాధనకు పోరాడాలని రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు వద్ద ఆటోస్టాండ్‌లో ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం జరిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ప్రజా సమస్యలపై ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. ఆటోలపై జరిమానాలు పెంచే జీవో 21,31లను రద్దు చేయాలన్నారు. మంగళవారం ఉదయం10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగే ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవికృష్ణ, శ్రీను, ఎల్లాజీ, పి.రాజు, మూర్తి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదే లక్ష్యం


పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సీఈవో ఫరీదా, చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

మహారాణిపేట : మిలియన్ వైఆర్‌సీ (యంగ్ రెడ్ క్రాస్) వలంటీర్ల నమోదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ. శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, సీఈవో ఎ.కె.ఫరీదా తెలిపారు. ఆదివారం విశాఖ రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృత పరుస్తామన్నారు. విద్యార్థులు, వలంటీర్లను పెద్ద సంఖ్యలో చేర్చుకుని వారి ద్వారా పేదలకు వివిధ రకాల సేవలందించాలని నిర్ణయించామన్నారు. వీరిందరికీ ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశాఖ జిల్లా చైర్మన్ వై.శివనాగేంద్ర రెడ్డి, కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతినిధులు రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గాయనీ గాయకుల రక్తదానం


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్

మహారాణిపేట : విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా కళాకారులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. దాతలకు రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. విశాఖ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భయ్యా శ్రీనివాస్, భూపతిరావు నిర్వహణలో ప్రతినిధులు వడ్రే నాంచారయ్య, ఎంవీఆర్ నాగేశ్వరరావు, సన్ మూర్తి, ఫణిస్వామి, పట్నం వెంకటేష్, రాధారాణి తదితరులు రక్తదాతలకు సహకరించారు. రక్తదాతలు గోపాలకృష్ణ, సంతోష్‌కుమార్, సతీష్ తదితరులు మాట్లాడుతూ ఇటువంటి సామాజిక కార్యక్రమంలో తాము పాల్గొనడం ఆనందదాయకమన్నారు. సంస్థ అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ప్రారంభమైన తమ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యోగ భాస్కర్, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రజలతో ముఖాముఖి


అబుసారంగ వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న మహ్మద్ సాధిక్

జగదాంబ : అభివృద్ధిపై ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ నిర్వహించారు. ఆదివారం వార్డులో ఫెర్రీరోడ్డు, అబుసారంగ వీధిలో వైఎస్సార్‌సీపీ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై ప్రజలతో మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా పాతనగరంలో కనీసం రోడ్లు కూడా లేని నేపథ్యంలో రహదారులు, కాలవల నిర్మాణం, వీధిలైట్లు వెలడం, తాగునీటి సరఫరా వంటి అన్ని సౌకర్యాలు ప్రజలకు అందిస్తున్న వైనంపై ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. రహదారులే కాకుండా వార్డులో షాదీఖానా, కోటవీధి, చిలకవీధిలో కమ్యూనిటీ హాళ్లు కూడా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. దీని ద్వారా ప్రజలు ఏ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలుపించుకుని జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యం.. వైశిష్ట్యం..

నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధికి కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా తన అవసరాలకు అనుగుణంగా నీటి వసతులను సమకూర్చుకుంటోంది. మరో వైపు పర్యావరణాన్ని, ప్రకృతిని సంరక్షిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ దిశగా నవ్య ప్రాజెక్టులకు రూపకల్పన చేసి చూపుతోంది. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా పలు వైవిధ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తన విశిష్టతను చాటుకుంటోంది. ఇటీవల కాలంలో ఏయూ చేపట్టిన నాలుగు అంశాలు ఎంతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. –ఏయూ క్యాంపస్

- వినూత్న ప్రాజెక్టులకు ఏయూ శ్రీకారం
- నీటి సంరక్షణకు ప్రత్యేకంగా చెరువు నిర్మాణం
- ఇంకుడు గుంతలు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం ఏర్పాటు
- ప్రత్యేక వాహనంతో కాలుష్య అధ్యయనం


ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన చెరువు

నీటి సంరక్షణకు చెరువు

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తూ కొత్త చెరువును ప్రత్యేకంగా తవ్వించారు. నూతనంగా నిర్మించిన అల్గారిదం భవనానికి ఆనుకుని దీనిని అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ రాతితో గట్టును సైతం నిర్మించారు. గట్టుపై విద్యార్థులు కూర్చుని సేదతీరడానికి ఉపయుక్తంగా సిమెంట్ బెంచీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు ప్రారంభించారు. వర్షా కాలంలో భవనాలపై పడే నీరు, ఇతర మార్గాల్లో వచ్చే నీటిని దీనిలోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసే సమయంలో దీనిలో పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ఈ చెరువును నిర్మించారు. సమీప ప్రాంతాల వారికి నీటి కొరత రాకుండా, భూగర్భ జలాలు పెరిగేలా ఈ చెరువు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


సేంద్రీయ ఎరువు తయారీ కేంద్రం

సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

వర్సిటీలో ఉన్న చెట్ల నుంచి నిత్యం రాలే ఆకులను ఎరువుగా మార్చడానికి ప్రత్యేకంగా సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏయూ శానిటేషన్ డీన్ కార్యాలయం చేరువలో దీనిని నిర్మించారు. నిత్యం వర్సిటీలో రాలే ఆకులు, ఎండిన చెట్ల వ్యర్థాలను కంపోస్ట్ తయారీ పిట్‌లలో వేసి ఎరువుగా మార్చుతారు. దీనిని మొక్కల పెంపకానికి వినియోగించనున్నారు.

కాలుష్య అధ్యయన వాహనం

ఏయూ మీటిరాలజీ, ఓషనోగ్రఫీ విభాగాలకు నూతనంగా మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మోనిటరింగ్ ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చింది. రూ.50 లక్షలతో దీనిని సమకూర్చారు. నగరంలోని వాయు కాలుష్యాన్ని గణించడానికి అవసరమైన ఉపకరణాలు ఈ వాహనంలో ఉన్నాయి. విభాగ విద్యార్థులు, పరిశోధకులు ఈ మొబైల్ వాహనం ద్వారా వాయు కాలుష్యాన్ని గుర్తించి, విశ్లేషిస్తారు.

మంచి చిత్రాలను ఆదరించాలి


విశాఖ కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: ఇటీవల విడుదలైన మార్టిన్ లూథర్ కింగ్ సినిమాపై సమీక్ష, చిత్రంలో నటించిన విశాఖ కళాకారులకు సత్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హాస్యప్రియ కామిడీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణ రావు, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే, సమాజంలో అసమానతలను ఎత్తిచూపుతూ ఆలోచింపజేసే చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ అని పేర్కొన్నారు. ఇటువంటి మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఇమంది ఈశ్వర రావు, కె.సి.హెచ్.గోపినాయుడు, ఎస్.కె.మదీన(మల్లిక)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరరావు, చిన్నారావు, త్రినాథరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

990వ రోజుకు 'ఉక్కు' దీక్షలు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులు రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 990వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులను పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోమని, పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

మురళీనగర్: చక్కెర వ్యాధి ఉన్న వారు నియమిత ఆహారం తీసుకోవడంతోపాటు కనీస వ్యాయామం చేయడం మంచిదని కేర్ ఆస్పత్రి చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ పి.వేణుమాధవి సూచించారు. సుంకరి ఆల్వార్‌దాస్ 93వ జయంతి సందర్భంగా ఆదివారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె స్థానికులకు పలు సూచనలిచ్చారు. షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవడం, వంటకాల్లో నూనె వాడకం తగ్గించుకోవాలని, సాధ్యమైనంత వరకు వేపుళ్లు, జంక్ ఫుడ్స్‌కు స్వస్తి చెప్పాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ డీఎస్‌వీ వేణి మాట్లాడుతూ చలికాలంలో చర్మం పొడిబారకుండా చూసుకోవాలన్నారు. వైరల్ జ్వరాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు.

174 మందికి వైద్య పరీక్షలు

వైద్య శిబిరంలో 174 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించారు. 102 మందికి గుండె పరీక్షలు(ఈసీజీ) ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వైద్యులను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికను అందించారు. డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పల పాటి శుభ, ఎలక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం శిబిరం నిర్వహణకు సహకరించారు.